క్లుప్తంగా

ప్రతిఒక్కరూ విధిగా పన్ను చెల్లించాలి


ఇంటి పన్ను చెల్లిస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ విధిగా పన్ను చెల్లించి, గ్రామాభివృద్ధికి తోడ్పాటునందించాలని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ అన్నారు. బుధవారం చౌడాపూర్ మండలం మరికల్ గ్రామ పంచాయతీలో తన ఇంటి పన్నును పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డికి చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలు సకాలంలో తమ ఇళ్ల, దుకాణాల పన్నులు చెల్లించి గ్రామ పంచాయతీకి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికులు కీలకం


పంచాయతీ కార్మికులకు గుర్తింపు కార్డులు అందిస్తున్న అధికారులు


కుల్కచర్ల: పారిశుద్ధ్య నిర్వహణలో కార్మికులు కీలకమని చౌడాపూర్ తహసీల్దార్ ప్రభ, ఎంపీడీఓ సోమలింగం పేర్కొన్నారు. బుధవారం చౌడాపూర్ మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులకు ఐడీకార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించి స్వచ్ఛ గ్రామాలుగా తయారు చేస్తున్నారన్నారు. కరోనా సమయంలోనూ వారు చేసిన కృషి అనిర్వచనీయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఎంపీఓ రాజిరెడ్డి, మండిపల్ కార్యదర్శి స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం


విద్యార్థులతో ఉపాధ్యాయులు

దుద్యాల్: మండల పరిధిలోని ఆలేడ్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్వపరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. కలెక్టర్‌గా నితిన్, డీఈవోగా అను శ్రీ, ఎంఈవోగా శ్రీజ, హెచ్ఎంగా ప్రవీణ్ వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు వారివారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాధికారి విజయరామారావు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గౌతమి, కుదురుమల్ల పాఠశాల హెచ్ఎం నిరంజన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే


ఖర్గేను కలిసిన ఎమ్మెల్యే టీఆర్ఆర్

పరిగి: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి రామ్మోహన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర రాజకీయ స్థితిగతులపై, ప్రభుత్వ పనితీరుపై ఆయన ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమపథకాలను అర్హులకు అందేల చూడాలని ఎమ్మెల్యేతో చెప్పారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలు, అభివృద్ధి పనులు ప్రజలకు తెలియజేయాలని ఖర్గే సూచించారు.

ఆస్తి పన్నుపై వడ్డీ రాయితీ

షాద్‌నగర్: ప్రభుత్వం వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద ఆస్తి పన్నుపై వడ్డీలో రాయితీని ఇస్తుందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సునీత కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీని ఇవ్వాలని మున్సిపల్ శాఖ నిర్ణయించినట్లు తెలిపారు. మార్చి 31 నాటికి ఆస్తి పన్ను బకాయిలపై 10 వడ్డీ చెల్లించిన వారికి వన్‌టైమ్ సెటిల్‌మెంట్ వర్తిస్తుందని తెలిపారు. ఆస్తి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బోర్ల మరమ్మతులు ఇంకెప్పుడు?

- సంవత్సర కాలంగా పనిచేయని బోర్లు
- నీటి సరఫరా సక్రమంగా లేక గ్రామస్తుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు


పనిచేయని బోరును చూపుతున్న కాలనీ వాసులు

దుద్యాల్: ఆసలే వేసవి కాలం..రోజురోజుకు ఎండలు పెరుగుతుండడంతో తాగునీటి కష్టాలు తప్పడం లేదు. మండలంలోని ప్రతీ గ్రామంలో వారంలో కనీసం రెండు నుంచి మూడు రోజుల వరకు మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతారయం ఏర్పడుతుంది. గ్రామాల్లో ఎక్కువగా తాగు నీటి ఇబ్బందులు పెరుగుతున్నాయి. ఏప్రిల్, మేలో ఎండల తీవ్రత ఎక్కువగానే ఉంటుంది. దీంతో రానున్న కాలంలో నీటికష్టాలు తప్పవని పలువురు హెచ్చరిస్తున్నారు. మార్చిలోనే బోర్లలో నీరు అడుగంటిపోయాయి. ఏప్రిల్, మేలో పరిస్థితి మరిదారుణంగా ఉంటుందని, ఎండల తీవ్రత పెరిగి బోర్లలో నీటి మట్టం అడుగంటుతాయని పలువురు ముందస్తుగానే సూచిస్తున్నారు. దీంతో తాగునీటికి మరింత ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం లేకపోలేదు. మండలంలోని పలు గ్రామాల్లో గ్రామ పంచాయతీ బోర్లు కొన్ని వినియోగంలో ఉండగా, మరి కొన్ని వృథాగా ఉన్నాయి. హస్నాబాద్ గ్రామంలో తెలుగు వాడలోని బోరు కొన్ని సంవత్సరాలుగా వృథాగా ఉంది. అలాగే గ్రామ పంచాయతీ సమీపంలో తాగునీటి శుద్ధి కేంద్రం వద్ద బోరు కాలిపోవడంతో దాదాపుగా ఏడాది క్రితం బోరులో నుంచి మోటర్ తీసేశారు. దాన్ని మరమ్మతులు చేయించే వారు కరువయ్యారు. బోయిని వాడలో కూడా ఓ బోరు వృథాగా ఉంది. పాడైన బోర్లను మరమ్మతులు చేయించేందుకు అధికారులు ఆసక్తి చూపించడం లేదని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ఆయా కాలనీల్లో తాగునీటి కష్టాలు మొదలయ్యాయని కాలనీ వాసులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బోర్లను మరమ్మతులు చేయిస్తే కొంత వరకు నీటి సమస్య అరికట్టవచ్చని ఆయా కాలనీల నాయకులు చెబుతున్నారు. ఈ విషయం గురించి గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిని సంప్రదించగా గ్రామ పంచాయతీలో నిధుల కొరతతో కొన్ని పనులు చేయలేకపోతున్నామని, నిధులు విడుదలైతే పనులు చేయిస్తామని వివరణ ఇచ్చారు.

వారంలో రెండు నుంచి మూడు రోజులు..

మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుంది. వారంలో రెండు నుంచి మూడు రోజుల పాటు నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది. గ్రామాల్లో అందుబాటులో ఉన్న గ్రామ పంచాయతీ బోర్లను ముందస్తుగా మరమ్మతులు చేయిస్తే కొంత వరకు నీటి సమస్య ఎదుర్కోవచ్చని గ్రామస్థులు తెలిపారు. నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే బోరు నీటిని వాడుకోవచ్చని చెబుతున్నారు. సంబంధిత అధికారులు ముందస్తు చర్యలు చేపడితే నీటి కొరతను కొంత వరకు అరికట్టవచ్చని పలువురు నాయకులు వివరిస్తున్నారు.


మరమ్మతు చేయని బోరు


తెలుగువాడలో అందుబాటులో లేని బోరు స్టాటర్

సహకార సంఘం అభివృద్ధే లక్ష్యం

పీఏసీఏస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి

మోమిన్‌పేట: సహకార సంఘం అభివృద్ధే లక్ష్యమని పీఏసీఏస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మోమిన్‌పేట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సర్వసభ్య సమావేశం విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం అభివృద్ధి చెందాలంటే సభ్యుల సహకారం అవసరమన్నారు. ఇప్పటికే నష్టాలలో ఉన్న సంఘాన్ని లాభాల బాట పట్టించినట్లు ఆయన వివరించారు. స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులను అమ్మడంతో వచ్చిన లాభాలు రూ.55లక్షలని చెప్పారు. సకాలంలో దీర్ఘకాలిక రుణాలను రైతులు చెల్లించడం వల్ల తిరిగి వాటిని వ్యాపార రంగాలకు రుణాల రూపేణ మంజూరు చేస్తున్నామన్నారు. సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులకు బంగారు ఆభరణాలపై తక్కువ వడ్డీలతో రుణాలను అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సంఘం మరింత అభివృద్ధి సాధించాలంటే ప్రతి సంఘం సభ్యుడు తీసుకున్న రుణాన్ని సకాలంలో వడ్డీ, అసలు కలుపుకుని చెల్లించాలని ఆయన సూచించారు. రూ.2లక్షల లోపు రుణమాఫీ ఎందుకు జరగలేదని రైతులు ప్రశ్నించారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు రుణమాఫీ జరిగితే తక్షణమే రైతులకు తిరిగి రుణాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, సీఈఓ శేఖర్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్మికులు

తాండూరు టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలంటూ తెలంగాణ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహా రెడ్డికి వినతి పత్రం అందజేశారు. జీఓ 60 ప్రకారం కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, మున్సిపల్ ట్రాక్టర్, ఆటో నడిపే కార్మికులను డ్రైవర్లుగా గుర్తించి పర్మినెంట్ చేయాలన్నారు. తాండూరులో ఈఎస్ఐ ఆస్పత్రిని వెంటనే ఏర్పాటు చేయాలని, కార్మికులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు పలువురు కార్మికులు వినతి పత్రంలో తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్, యూనియన్ గౌరవాధ్యక్షుడు కె రాములు, నాయకులు నరేష్, శ్రీనివాస్, వెంకటప్ప, లక్ష్మణ్, ప్రకాశ్, వెంకటయ్య, వీరేశం తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


బొంరాస్‌పేట: సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న నాయకులు


దుద్యాల్లో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్

పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్

బొంరాస్‌పేట: గ్రామాల అభివృద్ధే ధ్యేయమని పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కోస్గి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని మహంతీపూర్‌లో బుధవారం మంజూరైన సీఆర్ఆర్ నిధులు రూ.10లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామానికి కాగ్నా వాగుపై వంతెన పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు రాంచంద్రారెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింలుగౌడ్, మాజీ సర్పంచులు మహిపాల్, మొగులయ్య, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మంజూరైన ఎస్సీ సబ్ ప్లాన్ నిధుల నుంచి ఎస్సీ కాలనీలో బుధవారం కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకారం వేణుగోపాల్ సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం దుద్యాల్ మండల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలు అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు శ్రీశైలం గౌడ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, మాజీ సర్పంచ్ ఖాజా, మండల మైనార్టీ అధ్యక్షుడు హాజీ, గ్రామస్థులు సత్యనారాయణ, శరత్ చంద్ర, రఘు తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్


ఇఫ్తార్ విందులో వెంకట్

మోమిన్‌పేట: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఏస్ గోదాంలో మండల అధ్యక్షుడు డి వెంకట్ ముస్లిం సోదరులకు ఇఫ్తర్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలను సమానంగా చూశారన్నారు. అన్ని మతాల వారు పండుగలు జరుపుకునేందుకు కావాల్సిన ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఏస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, ఎంపీటీసీ మాజీ సభ్యులు, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సుభాష్‌గౌడ్, ముస్లిం సోదరులు మైబల్లి, ఖాదర్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభను విజయవంతం చేయండి

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో 28వ తేదీ(శుక్రవారం) నిర్వహించే మహాజన సభను విజయవంతం చేయాలని బుధవారం పీఏసీఎస్ చైర్మన్ బక్కన్నయాదవ్ ఒక ప్రకటనలో కోరారు. ఈ సభ ఉదయం 10:30 గంటలకు ప్రారంభమవుతుందని, 2024–25 వార్షిక సంవత్సరానికి సంబంధించిన సంఘం నివేదికపై చర్చిస్తామని పేర్కొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


శస్త్ర చికిత్సకోసం తీసుకెళ్తున్న వైద్యాధికారులు

కుల్కచర్ల: ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కంటి వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి మాధురి పేర్కొన్నారు. బుధవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కంటికి సంబంధించిన సమస్యలపై ఎవరూ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దన్నారు. ప్రతీ వారం కుల్కచర్ల ప్రభుత్వ ఆస్పత్రిలో ఆప్తమాలిక్ అసిస్టెంట్ జవహర్‌లాల్ ఆధ్వర్యంలో కంటి వైద్య చికిత్సలపై వైద్యశిబిరం నిర్వహిస్తారన్నారు. ఈ వైద్య శిబిరంలో 56మందికి కంటి శుక్లాల సమస్య ఉన్నట్లుగా గుర్తించారు. ప్రస్తుతం అత్యవసరం ఉన్న 28మందిని నగరంలోని పుష్పగిరి కంటి ఆస్పత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సుజాత, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య రానీయొద్దు


మాట్లాడుతున్న ఎంపీడీఓ విశ్వప్రసాద్

ఎంపీడీఓ విశ్వప్రసాద్

తాండూరు రూరల్: వేసవికాలం దృష్ట్యా ప్రజలకు తాగునీటి సమస్య రానీయొద్దని ఎంపీడీఓ విశ్వప్రసాద్ సూచించారు. బుధవారం తాండూరు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..ఏప్రిల్, మేలో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతిరోజు గ్రామాలకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. బోరు మోటార్లు పాడైతే వెంటనే మరమ్మతులు చేయించాలని చెప్పారు. తండాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీల్లో మొక్కలు ఎండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సుశీల్‌కుమార్, ఏపీఓ నరోత్తంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలు


దోమ: మోత్కూర్ గేట్ సమీపంలో చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి


పూడూరు: కడుమూరులో చలివేంద్రం ప్రారంభిస్తున్న బందయ్య తదితరులు

పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి

దోమ: బాటసారుల దాహార్తిని తీర్చేవి చలివేంద్రాలని పంచాయతీ కార్యదర్శి రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దోమ మండల పరిధిలోని మోత్కూర్ గేట్ సమీపంలో గ్రామ యువకులు ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వేసవి తాపం నుంచి ఉపశమనం పొందేందుకు పరిగి–మహబూబ్‌నగర్ ప్రధాన రోడ్డు మార్గంలో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కారోబార్ అంజిలయ్య, గ్రామస్థులు మైమూద్, ఖదీర్, పెంటయ్య, జంగయ్య, ఎన్టీఆర్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

సమాజసేవలో భాగస్వాములు కావాలి..

పూడూరు: ప్రతిఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని సామాజిక కార్యకర్త మొర్రి చిన్న బందయ్య పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని కడుమూరు గ్రామంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి సేవ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కడుమూరు, మిట్టకంకల్ గ్రామాల్లోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పంచాయతీల్లో తాగునీటి సరఫరా కోసం విద్యుత్ స్టాటర్లలను అందించామని తెలిపారు. గ్రామస్థుల సహకారంతో స్వచ్ఛందగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో వితలయ్యగౌడ్, వెంకటయ్య, సుక్కయ్య, నర్సింలు, నరేష్, బాలకిష్టయ్య, రమేశ్, రామచంద్రయ్య, మైసయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన


కొడంగల్ రూరల్: పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ విజయకుమార్, ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్ రూరల్: పట్టణంలోని పదోతరగతి పరీక్ష కేంద్రాలను బుధవారం తహసీల్దార్ విజయకుమార్, ఎంపీడీఓ ఉషశ్రీ, ఎంఈఓ రాంరెడ్డి పరిశీలించారు. నాలుగు కేంద్రాల్లో గణిత పరీక్షలు జరిగాయని, ఇందులో 994మంది విద్యార్థులకుగాను 982మంది పరీక్షలకు హాజరయ్యారని, 12మంది గైర్హజరయ్యారని ఎంఈఓ రాంరెడ్డి తెలిపారు.

దౌల్తాబాద్‌లో..

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత, ప్రాథమిక పాఠశాల పరీక్షా కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. బుధవారం రెండు కేద్రాల్లో 331 మంది విద్యార్థులకు గాను 327 మంది హాజరయ్యారని ఎంఈఓ వెంకట్ స్వామి తెలిపారు.

సీసీ కెమెరాలతో నేరాల అదుపు


మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్ఐలు

చేవెళ్ల: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడతాయని సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని రావులపల్లి గ్రామంలో సీసీ కెమెరాలను సీఐ భూపాల్‌శ్రీధర్, ఎస్ఐలు శ్రీకాంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, శిరీష ప్రారంభించారు. గ్రామంలో గతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మరమ్మతులు లేక పనిచేయకపోవటంతో పోలీసుల సూచనలతో మాజీ సర్పంచ్ జి.రాంచంద్రయ్యగౌడ్ ముందుకొచ్చి అన్నింటిని బాగుచేయించి అందుబాటులోకి తీసుకొచ్చాడు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. అనంతరం మాజీ సర్పంచ్ రాంచంద్రయ్యగౌడ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాగిరెడ్డి, కేసారం నరేందర్, సత్యనారాయణ, అశోక్, జంగయ్య, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొడంగల్ రూరల్: మండల పరిధిలోని టేకుల్‌కోడ్ గ్రామ శివారులోని 33/11కెవి సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా రుద్రారం, టేకుల్‌కోడ్, అన్నారం, పాటిమీదిపల్లి, నాగారం, ధర్మపురం, బోనమ్మ తండా, బోయపల్లి తండాలలో గురువారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు విద్యుత్ అంతరాయనికి సహకరించాలని వారు కోరారు.

◆ రేపు పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు చైర్మన్ వై. సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి సంఘం పరిధిలోని గ్రామాలు, తండాల రైతులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

◆ నేడు ఎల్మకన్నె పీఏసీఎస్ సర్వసభ్య సమావేశం

తాండూరు రూరల్: మండల పరిధిలోని ఎల్మకన్నె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సీఈఓ శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం ఉదయం 11:30 నిమిషాలకు నిర్వహించనున్న సమావేశానికి డీసీసీబీ వైస్ చైర్మన్ రవిగౌడ్ హాజరవుతారని తెలిపారు. కావున డైరక్టర్లు, రైతులు తప్పకుండా హాజరు కావాలని కోరారు.

◆ గెలుపోటములు సహజం



దౌల్తాబాద్: క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ మండల నాయకుడు కోట్లహన్మంతు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని తిర్మాలాపూర్ గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాములు, మాజీ సర్పంచ్ వెంకట్రాములు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక సాయం అందజేత

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కుల్కచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం ముజాహిద్‌పూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త సుల్తాన్‌పూర్ బాల్‌రాజ్ మాతృమూర్తి అంతమ్మ ఆకస్మికంగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి స్థానిక నాయకులచేత తక్షణ ఆర్థిక సాయంగా రూ.5వేలు పంపించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రభూపాల్, సోమలింగం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ కాంగ్రెస్ బలోపేతానికి కృషి

అనంతగిరి: రాష్టంలో ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఆయాపార్టీల నాయకులు, బీసీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని వికారాబాద్ పట్టణ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వికారాబాద్ మున్సిపాలిటీలోని 2వ వార్డు ధన్నారం గ్రామానికి చెందిన నాయకులు కమ్మరి మాణిక్యం, తెలుగు లక్ష్మయ్య, చిప్పె దశరథ్, చిప్పె గోపాల్, సుధాకర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సంగని జంగయ్య, న్యామద్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

◆ పంటల పరిశీలన



దుద్యాల్: మండలంలో ఇటీవల కురిసిన వానకు దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు పరిశీలించారు. పంట నష్టాన్ని అంచనవేశారు. ప్రతి గ్రామంలో రైతుల పొలాల వద్దకు వెళ్లి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా హస్నాబాద్ వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక రైతుల పొలాలను పరిశీలించి పంట నష్టాన్ని నమోదు చేశారు.